
## ధనలక్ష్మీగా వాసవీమాత

**రూ.13 లక్షల కరెన్సీతో అలంకరణ**

**దేవీ శరన్నవరాత్రి** ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కిషన్‌గంజ్ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవీమాతను ధనలక్ష్మీ అవతారంలో రూ. 13లక్షల కరెన్సీతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.
–సుభాష్‌నగర్, అక్టోబర్ 7



## బతుకమ్మ చీరల పంపిణీ ఎక్కడ?

- తెలంగాణ పండుగలపై రేవంత్ సర్కారు వివక్ష
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఆగ్రహం



ఆర్మూర్‌టౌన్, అక్టోబర్7: తెలంగాణ పండుగలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రం ఏర్పడ్డాక మన పండుగలకు తొలి ప్రాధాన్యత ఇచ్చి, అన్ని మతాల వారిని గౌరవించారని తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ కానుకగా ప్రతి ఏటా దసరాకు ముందు బతుకమ్మ చీరలను ప్రతి ఇంటికీ పంపిణీ చేశారని గుర్తుచేశారు. ముస్లింలు, క్రైస్తవుల పండుగలకు కూడా వారికి దుస్తులను పంపిణీ చేసి, పండుగలను అధికారికంగా నిర్వహించారని తెలిపారు. స్వరాష్ట్రంలో ప్రతి పండుగనూ బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్వహించిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పండుగలను కనుమరుగు చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే రేవంత్ సర్కారు ఆరు గ్యారెంటీలు అంటూ ఉన్న భరోసాలను తొలగించిందని ఎద్దేవా చేశారు. ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు బీఆర్ఎస్ హయాంలో పదేండ్లు సుమారు 13లక్షల చీరలను ఆడబిడ్డలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ పండుగలపై వివక్ష చూపవద్దని సూచించారు. లేదంటే తెలంగాణ ప్రజలు హైడ్రా కన్నా ఎక్కువ భూస్థాపితం చేస్తారని సోమవారం ప్రకటనలో హెచ్చరించారు.


## బతుకమ్మ సంబురం

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో** బతుకమ్మ సంబురాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అలిగిన బతుకమ్మ వేడుకలు జరుపుకొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ చేరి మహిళలు ఆడిపాడారు. అనంతరం గ్రామ శివారులోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. గ్రామాల్లోని చౌరస్తాలన్నీ పూలవనాలను తలపించగా.. ఆడపడుచులతో సందడిగా మారాయి.



కోటగిరిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# కళంకితులకే అందలం!



**ఠాణాపై దాడి చేసిన నాయకుడికి పదవి**

- లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న నేతకు కీలక బాధ్యతలు
- నిఘా వర్గాల నివేదికలు బుట్టదాఖలు
- పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు
- కాంగ్రెస్ అధిష్టానంపై పార్టీ నేతల్లో అసహనం
- ఉమ్మడి జిల్లాలో పలువురిపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

**ప్రజాక్షేత్రంలో ఉన్న నాయకులు** అవినీతి, బంధుప్రీతి, వివాదాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తారనే భావన నాయకుల వ్యవహారశైలిపై ఆధారపడి ఉంటుంది. కానీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పలువురు కళంకితులకు పదవులు వరించడం.. అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపుతున్నది. అలాంటి వారిని అందలం ఎలా ఎక్కిస్తారని ఒకవైపు పార్టీ శ్రేణులు ప్రశ్నించగా.. మరోవైపు ఆశావహులు మండిపడుతున్నారు. ఎలాంటి మచ్చ లేకుండా పనిచేస్తున్న కార్యకర్తలు, సీనియర్ నాయకులను పక్కనబెట్టి, వివాదాస్పద వ్యక్తులకు పదవులు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు. ఈ వ్యవహారంపై హస్తం నేతల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.
–నిజామాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**రాష్ట్రంలో** కాంగ్రెస్ ప్రభుత్వం కళంకిత నాయకులను ఉన్నత స్థానాల్లో కూర్చో బెట్టడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ జానీకి జాతీయ అవార్డును కేంద్రం రద్దు చేయడంతో ఈ వ్యవహారం తెర మీదికి వచ్చింది. స్వయంగా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం ఉండడంతో కేంద్ర సర్కారు వెనుకడుగు వేసింది. కామారెడ్డి జిల్లాలోని గాంధారి పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన ఓ నాయకుడికి ఓ మార్కెట్ కమిటీలో కీలక పదవిని అప్పగించారు. ఇతగాడిపై కామారెడ్డి ఠాణాలోనూ పలు ఫిర్యాదులు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో ఓ నాయకుడిపై ఒక మహిళ తీవ్ర లైంగిక ఆరోపణలు చేయగా.. ఈ వ్యవహారం చర్చనీయాంశమైంది. తనను అధికార పార్టీ నేత మోసం చేశారంటూ ఆరోపణలు సైతం చేయగా సదరు నేతకే పదవులు వరించడం గమనార్హం. కళంకితులకు పదవుల కట్టబెట్టడం ద్వారా కాంగ్రెస్ నవ్వుల పాలవుతుందని ఆ పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు.

**కేసు నడుస్తున్నా.. వరించిన పదవి**

గాంధారి పోలీస్ స్టేషన్‌పై కొద్ది రోజుల క్రితం దాడి జరిగింది. కొంతమంది వ్యక్తులతో కలిసి ఓ నాయకుడు ఇందులో కీలక పాత్రధారిగా నిలిచాడు. ఈ కేసును జిల్లా ఎస్పీ తీవ్రంగా పరిగణించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు విచారణ కొనసాగుతున్న క్రమంలో ఠాణాపై దాడి చేసిన వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వం కీలక పదవిని అప్పగించింది. తద్వారా ప్రజలకు తప్పుడు సందేశాన్ని పంపించేలా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాడులకు తెగబడితేనే పదవులా! శాంతి, భద్రతల పరిరక్షణ కోసం నిబద్ధతో పనిచేస్తున్న పోలీసులపై దాడి చేసిన వ్యక్తికి పదవిని కట్టబెట్టడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అలాంటి వారికి రాజకీయంగా ప్రమోషన్ కల్పించడంతో స్థానికంగా తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశమూ ఉంది. దాడులకు తెగబడితేనే పదవులు వస్తాయా? అనే చర్చ నడుస్తోంది. పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన నాయకుడికి పదవి ఇవ్వొద్దని స్థానిక పోలీసులే ఓ ప్రజాప్రతినిధికి మొర పెట్టుకున్నారు. ఠాణాపై దాడి చేసిన వారికి చట్టం ముందు శిక్షార్హులుగా నిలబెట్టాల్సిన అవసరం ఉందని వాదించారు. లేదంటే ఇలాంటి చర్యలు పెరిగిపోయే ప్రమాదం ఉన్నదని ఖాకీలు చెప్పినప్పటికీ.. మొండిగా ఓ కాంగ్రెస్ నేత ముందుకెళ్లారు. దీంతో పోలీసులంటే ప్రజల్లో చులకన భావన ఏర్పడే పరిస్థితి ఏర్పడింది. నిఘా వర్గాలు సైతం రంగంలోకి దిగి సదరు నాయకుడి తీరుపై నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. కానీ ప్రభుత్వ పెద్దలు అవేమీ పట్టించుకోకపోవడంతో వ్యవసాయ శాఖ ద్వారా ఆర్డర్ కాపీ జారీ కావడంతో పోలీసులు మిన్నకుండి పోవాల్సి వచ్చింది. సదరు నాయకుడికి ప్రొటోకాల్ పేరుతో ఏదో ఒక రూపంలో పోలీసులే మర్యాదలు చేయాల్సిన పరిస్థితి రావడం గమనార్హం.



### లైంగిక ఆరోపణలు బుట్టదాఖలు..

సుదీర్ఘ కాలం తర్వాత నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం కొలువుదీరింది. చాలా మంది ఆశావహులు పోటీపడగా నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్ ప్రాంతాలకు చెందిన వారికి అవకాశం కల్పించారు. ఇందులో ఓ కీలక పదవిని పొందిన నాయకుడిపై ఓ మహిళ తీవ్రమైన లైంగిక ఆరోపణలు చేసింది. దాదాపుగా ఆరు నెలల నుంచి ఈ వ్యవహారం నడుస్తోంది. దశాబ్దాల క్రితం నుంచి ఓ మహిళతో సహజీవనం చేస్తున్న విషయం బయటికి పొక్కడంతో సదరు కాంగ్రెస్ నేత ఉక్కిరిబిక్కిరయ్యాడు. తీరా సీన్ కట్ చేస్తే ఆయనకే మార్కెట్ కమిటీలో కీలక బాధ్యతలను అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీ తీరుపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. సొంత పార్టీలోనూ పలువురు నేతలు అధిష్టానం తీరును తప్పుపడుతున్నారు. లైంగిక ఆరోపణలు వెలుగు చూసినప్పటికీ పదవులు కట్టబెట్టడం ద్వారా సమాజానికి ఏం చెప్పాలనుకుంటున్నారంటూ నిలదీస్తున్నారు. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల భర్తీలో కళంకితులకు పదవులు కట్టబెట్టడం దుమారం రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో నైతికత అన్నది బుట్టదాఖలు కావడం, తాము అనుకున్నది అమలు చేయడం మినహా ప్రజలు ఏమనుకుంటారు? అనే ఆలోచనే చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలి

**రైతులకు 48 గంటల్లో చెల్లింపులు జరగాలి**

**కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

కామారెడ్డి, అక్టోబర్ 7: వానకాలం (2024–25)లో సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైస్ మిల్లుల యజమానులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని ఏరోజుకు ఆరోజు మిల్లులకు తరలించాలని సూచించారు. తరలించిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, 48 గంటల్లో రైతులకు చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. దొడ్డు, సన్న రకం ధాన్యాన్ని వేర్వేరుగా నిల్వ చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని త్వరగా పూర్తిచేయాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, రైస్ మిల్లుల సంఘం అధ్యక్షుడు పప్పుల రాజేందర్, కార్యదర్శి సంతోష్ కుమార్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ అశీష్ సంగ్వాన్

## గుండెపోటుతో యువతి మృతి



డేగావత్ బినా (ఫైల్)

నస్రుల్లాబాద్, అక్టోబర్ 7: వారం రోజుల వ్యవధిలో తాత, మనవరాలు గుండెపోటుతో మృతిచెందిన ఘటన నస్రుల్లాబాద్ మండలం సంగం గ్రామంలో చోటుచేసుకున్నది. సంగం గ్రామానికి చెందిన తార్యానాయక్ మనవరాలు డేగావత్ బినా(19) నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో నర్సుగా పనిచేస్తున్నది. వారం రోజుల క్రితం తార్యానాయక్ గుండెపోటుతో మృతి చెందడంతో డేగావత్ బినా స్వగ్రామానికి వెళ్లింది. బినాకు ఆదివారం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబీకులు వెంటనే నిజామాబాద్ దవాఖానకు తరలించారు. యువతిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వారం రోజుల వ్యవధిలో తాత, మనవరాలు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

## ధర్పల్లిలో రోజంతా కరెంట్ కట్

- తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు విద్యుత్ కోత
- ఇబ్బందులు ఎదుర్కొన్న గ్రామస్తులు
- విద్యుత్ శాఖ అధికారులపై ఆగ్రహం




ధర్పల్లి సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్తుల ఆందోళన

ధర్పల్లి, అక్టోబర్ 7 : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తలెత్తిన సమస్యలతో మండలకేంద్రంలో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచినపోవడంతో జనజీవనం స్తంభించినంత పనైంది. తాగునీరు రాకపోవడంతో మండలకేంద్ర ప్రజలు ఉదయం నుంచే ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవానీ మాలధారు లు స్నానం చేద్దామంటే నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలువురు సబ్‌స్టేషన్ చేరుకొని, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ రోజంతా కరెంట్ పోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతవరకు తాగడానికి నీరు లేక ప్రైవేట్ ప్లాంట్లు, షాపులను ఆశ్రయించి నీటిని కొనుగోలు చేశారు. చార్జింగ్ లేక సెల్‌ఫోన్లు సైతం మూగబోయాయి. ఉదయం 5.30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోగా సుమారు సాయంత్రం 4 గంటలకు కరెంట్ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. సబ్‌స్టేషన్‌లో మళ్లీ సమస్య తలెత్తగా సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గం టల వరకు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ డీఈ ఉత్తంకుమార్, ఏడీ శ్రీనివాస్ సబ్‌స్టేషన్‌తో మరమ్మతులు చేయించారు. రాత్రి 7 గంటల కు సరఫరా పునరుద్ధరించినా, స్థానిక గాంధీ చౌక్ ప్రాంతంలో మాత్రం రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరా చేశారు. దీనిపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సీతాయిపేట్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొనగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఏ సమస్య వచ్చినా సకాలంలో స్పందించడం లేదని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

## బంద్ ప్రశాంతం

**జిల్లా కేంద్రంలో మూసి ఉంచిన దుకాణాలు**



వినాయక్‌నగర్, అక్టోబర్ 7: మహ్మద్ ప్రవక్తపై కొందరు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మైనార్టీలు సోమవారం జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో నగరంలోని ఆజాంరోడ్, అర్సపల్లి, మాలపల్లి, బోధన్ రోడ్డు, ఖిల్లాతోపాటు ఆటోనగర్, నెహ్రూపార్క్, గాంధీ చౌక్ తదితర ప్రాంతాల్లోని అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు, పండ్ల వ్యాపారులు బంద్ పాటించారు. తమ మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన వ్యక్తి పై 'ఉపా' చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బంద్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకొకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రధాన కూడళ్ల వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు సివిల్, స్పెషల్ పార్టీ, స్పెషల్ బ్రాంచ్‌తో పాటు సీసీఎస్ టీమ్స్ సైతం బందోబస్తులో పాల్గొన్నాయి. బంద్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## కబ్జా స్థలాన్ని సర్వే చేయించండి

**తహసీల్ ఆఫీస్‌లో బైఠాయించిన కొండాపూర్ గ్రామస్తులు**

రుద్రూర్, అక్టోబర్ 7: మండలంలోని కొండాపూర్ శివారులో కబ్జాకు గురైన స్థలాన్ని వెంటనే సర్వే చేయించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం తహసీల్ కార్యాలయంలో బైఠాయించారు. కబ్జాకు గురైన స్థలాన్ని సర్వే చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం ఇచ్చినమాట ప్రకారం అధికారులు వెంటనే కబ్జా స్థలాన్ని సర్వే చేయించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ తారాబాయికి వినతిపత్రం అందజేయగా.. మంగళవారం సర్వేయర్‌ను గ్రామానికి పంపిస్తానని తహసీల్దార్ చెప్పడంతో గ్రామస్తులు వెనుదిరిగారు.



తహసీల్దార్ కార్యాలయంలో బైఠాయించిన కొండాపూర్ గ్రామస్తులు